11102024-MAI-06_Layout 1 10/11/2024 2:05 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

రతన్ టాటా సెలవు

ఘనమైన వారసత్వాన్ని సమున్నత శిఖరాలకు చేర్చడం మాటలు కాదు. మేరునగ సమానమైన సంస్థను కొత్త బాట పట్టించడం అంత తేలిక కాదు. ఆ రెండూ సాధించిన తర్వాత సౌమ్యునిగా, నిగర్విగా మనుగడ సాగించడం అందరివల్లా కాదు. ఆ అరుదైన మానవుడే రతన్ టాటా. పేరులో టాటా ఉందని ఆయన వాసికెక్కలేదు. ముత్తాత జంషేడ్జీ టాటా నాటిన విత్తు మహా వృక్షమైంది. ఆ పారిశ్రామిక సామ్రాజ్యాన్ని సరికొత్త పుంతలు తొక్కించిన ఏకైక వ్యక్తి ఎవరంటే వచ్చే సమాధానం.. రతన్ టాటా. పేరుకు తగ్గట్టు ఆయన జాతి రత్నమే. నిన్నటిలాగే నేడూ అనే రొడ్డకొట్టుడు దారిలో ఆయన వెళ్లలేదు. వందేండ్ల పైచిలుకు కాలం నాటి కంపెనీని ఆధునిక యుగం అవసరాలు తీర్చే టెక్ బాట పట్టించారు. కంప్యూటర్, కమ్యూనికేషన్స్ రంగంలో కొత్త అంగలు వేయించారు. ఆయన సారథ్యంలో టీసీఎస్ ఓ విశ్వ కంపెనీగా ఎదగడం తెలిసిందే. ఒకప్పుడు రవాణా వాహనాలకే పేరు పొందిన కంపెనీని ప్రయాణికుల వాహనాల తయారీలో అగ్రస్థాయికి తీసుకువెళ్లారు. ల్యాండ్ రోవర్, జాగ్వార్ వంటి బ్రిటిష్ కంపెనీలను సొంతం చేసుకొని ఇదీ భారతీయ సత్తా అని చాటారు. సంపన్నులకే కాదు, సామాన్యులకూ కార్లు అందుబాటులోకి తేవాలని ఆయన పడిన తపన మరచిపోలేం. రెండు విడతల్లో టాటా గ్రూప్ చైర్మన్‌గా రెండు దశాబ్దాలకు పైగా సేవలందించారు. ఆ బాధ్యతల నుంచి తప్పుకొన్న తర్వాత అంకుర సంస్థలను ప్రోత్సహిస్తూ భారతీయ పారిశ్రామికతలో కొత్తరక్తం ఎక్కించేందుకు కృషిచేశారు.

సమకాలీన భారతీయ పారిశ్రామిక ప్రపంచంలో దిగ్గజంగా అగ్రపూజలు అందుకున్న చరిత్ర ఆయనది. అపూర్వమైన రీతిలో ప్రజాభిమానం చూరగొన్న విభిన్నమైన వ్యక్తిత్వం ఆయన సొంతం. కాసులు వెదజల్లి లాభాలు దండుకోవడమనే అనైతికతకు ఆయన బహుదూరం. నిఖార్సైన నిజాయితీకి నిలువెత్తు రూపంగా జనం ఆయనను పదే పదే గుర్తుచేసుకోవడం, కథలు కథలుగా ఆయనకు సంబంధించిన ఉదంతాలను చెప్పుకోవడం చిన్న విషయం కాదు. వర్గ పక్షపాతాలకు అతీతంగా, లివింగ్ లెజెండ్‌గా సకలజనుల మన్ననలు పొందడం ఆయనకే చెల్లింది. ఎక్స్ వేదికపై 1.3 కోట్ల మంది, ఇన్‌స్టాగ్రాంలో కోటి మంది ఫాలోవర్లతో సామాజిక మాధ్యమాల్లో అత్యధిక అభిమానం పొందిన పారిశ్రామికవేత్తగా రతన్‌కు లభించిన గుర్తింపే ఇందుకు తార్కాణం.

అయితే ఓ పెద్ద పారిశ్రామిక సామ్రాజ్యానికి సారథిగా ఎదిగివచ్చిన రతన్ వ్యక్తిగత జీవితంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కోవాల్సి వచ్చింది. తల్లిదండ్రుల విడాకులతో అనాథగా మారిన ఆయన భావి జీవితంలో ఎందరికో అన్నం పెట్టే స్థాయికి ఎదగడం విశేషం. తన జీవితపు వివిధానేక దశల్లో ప్రేమలు పూచే సీమల లోపల విహరించినా పెండ్లి ఎండమావిగానే మిగిలిపోవడం విషాదం. జంటగా మారే అవకాశం నాలుగుసార్లు తలుపు తట్టి వెనుకకు వెళ్లిపోయిందని ఆయనే చెప్పుకొన్నారు. మహాత్ములకు లోకమే కుటుంబం అన్న సూక్తిని అక్షరాలా నిజం చేసిన అమృతమూర్తిగా అద్వితీయ కీర్తిని పొందారు. పారిశ్రామికవేత్తగా, వ్యక్తిగా ఆయన వేసిన ముద్ర అనితరసాధ్యం. అందుకే ఇవాళ భారతదేశం సజల నయనాలతో ఆయనకు నివాళి ఘటిస్తున్నది.

మాదిగలంటే ముఖ్యమంత్రికి మంటెందుకు?

నరేష్ పాపట్ల
95054 75431

తెలంగాణ రాష్ట్రంలో దళితుల జనాభాలో సింహభాగంగా ఉన్న మాదిగ సామాజికవర్గంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉక్కుపాదం మోపుతుండటం ఆందోళనకరం. 'నోటితో నవ్వి నొసటితో వెక్కిరించినట్టుగా' ఆయన వ్యవహరిస్తున్నట్టు మరోమారు రుజువైంది. మొన్నటివరకు మాదిగలకు రాజకీయ అవకాశాలను దూరం చేస్తూ వచ్చారు. ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి హోదాలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కి ఉపాధ్యాయ నియామకాలు, వైద్య విద్యలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా మాదిగ నిరుద్యోగ యువతను బహిరంగంగా వంచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రేవంత్.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాదిగలకు రాజకీయ, ఉద్యోగ రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతున్నదనడానికి స్పష్టమైన ఆధారాలున్నాయి.

మూడు దశాబ్దాల కలను నెరవేరుస్తూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2024 ఆగస్టు 1న గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. 'సర్వోన్నత న్యాయస్థానం తీర్పును దేశంలోనే అందరికన్నా ముందుగా అమలుచేసే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుంది. ఇప్పుడు అమల్లో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్లలోనూ వర్గీకరణను అమలు చేస్తాం. అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొస్తాం' అని అదే రోజు అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించారు. కానీ, 60 రోజుల్లోనే ఆయన మాట తప్పారు. డీఎస్సీ (ఉపాధ్యాయ) ఉద్యోగ నియామకాలు, వైద్య విద్య ప్రవేశాల్లో వర్గీకరణను అమలు చేయకుండా సహజ స్వభావం చాటుకున్నారు. త్వరలో చేపట్టనున్న గ్రూప్ ఉద్యోగాల నియామకాల్లోనూ వర్గీకరణను అమలు చేయకుంటే మాదిగలకు మరింత నష్టం జరుగుతుంది.

ఇప్పుడే కాదు, రేవంత్ రెడ్డి తన తొలి మంత్రివర్గంలో మాదిగలకు స్థానం కల్పించకుండా ఆదిలోనే అవమానపరిచారు. ప్రభుత్వ విప్, టీజీపీఎస్సీ సభ్యులు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ వంటి సాధారణ పదవులను కట్టబెట్టి మమ అనిపించారు. కీలక పదవుల్లో మాదిగలను విస్మరిస్తుండటం విస్మయం కలిగిస్తున్నది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ల కేటాయింపుల్లో మాదిగల ప్రాధాన్యాన్ని క్రమంగా ఎందుకు తగ్గిస్తున్నారు? తాము రాజకీయంగా అంటరానివారమా? అనే ప్రశ్నలు మాదిగ ప్రతినిధుల్లో ఉదయిస్తున్నాయి. త్వరలో జరగనున్న రెండవ విడత మంత్రివర్గ విస్తరణలో కూడా మాదిగలకు మొండిచెయ్యి తప్పదనే వార్తలు వినవస్తున్నాయి. పొరుగు రాష్ట్రం ఏపీలో మాదిగ సామాజికవర్గానికి చెందిన వంగలపూడి అనితకు అత్యంత కీలకమైన హోం శాఖ మంత్రిత్వ బాధ్యతలు కట్టబెట్టి ఎన్డీయే కూటమి సముచితంగా గౌరవించింది. ప్రజా పాలన అంటూ స్వీయ గొప్పలు చెప్పుకొంటున్న తెలంగాణ ప్రభుత్వంలో ఈ విధానం ఎందుకు లేదు? అనే ప్రశ్నకు హస్తం అగ్రనేతలు సమాధానం చెప్పాలి.

రాష్ట్రం నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించే విషయంలోనూ తొలిసారిగా మాదిగ సామాజికవర్గం అవకాశం కోల్పోవడం ఆవేదన కలిగిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17 లోక్‌సభ స్థానాలుండగా, వాటిలో పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, వరంగల్ నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వ్‌డ్. గతేడాది డిసెంబర్‌లో రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో రిజర్వ్‌డ్ స్థానాల నుంచి రాజకీయ పలుకుబడి కలిగిన ఇద్దరు మాలలతో పాటు బైండ్ల (మాదిగ ఉపకులం) సామాజికవర్గానికి చెందిన మహిళను బరిలో నిలిపింది. తద్వారా ఒక్క స్థానంలో కూడా మాదిగలకు అవకాశం ఇవ్వకుండా మొదట్లోనే నిర్దాక్షిణ్యంగా అణచివేసింది. బీఆర్ఎస్ పార్టీ గతంలో మాదిరిగానే జనాభా ప్రాతిపదికన ఇద్దరు మాదిగ, ఒక మాల సామాజికవర్గానికి చెందిన అభ్యర్థిని పోటీలో నిలపగా.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సైతం ఇదే పద్ధతిని అనుసరించింది. హోరాహోరీగా జరిగిన లోక్‌సభ ఎన్నికల సమరంలో మూడు రిజర్వ్‌డ్ స్థానాల్లోనూ 'రాజ్యాంగ పరిరక్షణ' నినాదంతో ముందుకువచ్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ప్రజలు పట్టం కట్టారు. ఈ క్రమంలో రాష్ట్రం నుంచి మాదిగలను పార్లమెంట్ మెట్లు ఎక్కకుండా చేసిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ గద్దెనెక్కాక నామినేటెడ్ పదవుల భర్తీలోనూ మాదిగలకు అన్యాయమే జరిగింది. మొత్తం 34 మందితో కూడిన తొలి జాబితాలో మాదిగ సామాజికవర్గానికి ఒక్కరికి మాత్రమే చోటు దక్కడం శోచనీయం. అది కూడా సంప్రదాయబద్ధంగా వస్తున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి కావడం గమనార్హం. ఇక, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ మాదిగలకు టికెట్‌ను నిరాకరించి మరోసారి మోసం చేసింది. తన రాజకీయ ఎదుగుదలలో మాదిగలు కీలకపాత్ర పోషించారని స్వయంగా రేవంత్ రెడ్డి పలు బహిరంగ సభలు, సమావేశాల్లో చెప్పారు. 'ఏరుదాటిన తర్వాత తెప్ప తగలేసిన' చందంగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక రేవంత్.. మట్టి మనుషులైన మాదిగలను తీవ్రంగా అణచివేస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీకి ఆరు పర్యాయాలు ఎన్నికైన మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులుకు కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి కూడా రేవంత్ రెడ్డి ఇష్టపడలేదు. మాదిగ సామాజికవర్గానికి రాజకీయంగా జరుగుతున్న అన్యాయంపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని పలుమార్లు ఆయన బహిరంగంగా కోరినా రేవంత్ స్పందించలేదు. రేవంత్ పాలనలో తమ కులం రాజకీయంగా అణచివేతకు గురవుతున్నదని ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ ఆవేదన వ్యక్తం చేస్తున్నా కాంగ్రెస్ అధిష్ఠానం పెడచెవిన పెడుతున్నది. ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి ఎంపీ టికెట్లు ఇవ్వడం సరికాదని మాదిగ సామాజికవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ బక్క జడ్సన్ బాహాటంగా అభిప్రాయాన్ని తెలపగా.. కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఆయనపై ఆరేండ్ల పాటు బహిష్కరణ వేటు వేసింది. గతంలో ఇదే కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు ఏకంగా అధిష్ఠానం నియమించిన రాష్ట్ర వ్యవహారాల కమిటీ ఇన్‌చార్జీ గురించి అనుచితంగా మాట్లాడినప్పుడు క్రమశిక్షణ కమిటీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దాని ద్వంద్వ నీతిని తెలియజేస్తున్నది. ప్రజా పాలనలో మొదటి బహిష్కరణ వేటు మాదిగ సామాజికవర్గానికి చెందిన జడ్సన్‌పై పడిందన్న విషయాన్ని చరిత్ర ఎన్నటికీ మరచిపోదు.

> **'మార్పు రావాలి.. ఒక్క అవకాశం' అంటూ అధికారంలో వచ్చిన రేవంత్.. సామాజిక న్యాయానికి యథేచ్ఛగా తూట్లు పొడుస్తున్నారు. మంత్రివర్గంలో అతి తక్కువ జనాభా కలిగిన సామాజికవర్గాలను అందలమెక్కించి.. మెజారిటీ జనాభా కలిగిన వర్గాలకు అరకొర అవకాశం ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల కేటాయింపు, నామినేటెడ్ పదవుల్లోనూ తన సొంత సామాజికవర్గానికి రేవంత్ అధిక ప్రాధాన్యం ఇవ్వడం బహుజనుల కన్నెర్రకు కారణమవుతున్నది.**

బ్యూరోక్రాట్ల హోదా, శాఖల కేటాయింపులోనూ వర్గ ప్రీతిని ప్రదర్శించారు. ఇలా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్ష నియంతృత్వ విధానాలను అవలంబిస్తుండటాన్ని బహుజనులు గమనిస్తూనే ఉన్నారు. మాదిగల పుట్టుకలోనే పోరాటం ఉంది. న్యాయమైన హక్కుల సాధన కోసం కొట్లాడటం మాదిగలకు కొత్తేం గాదు. ఇంకా అణచివేస్తామంటే కాంగ్రెస్‌కు రాజకీయంగా చావు 'డప్పు' కొట్టడం తథ్యం.

> **ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి ఎంపీ టికెట్లు ఇవ్వడం సరికాదని మాదిగ సామాజికవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ బక్క జడ్సన్ బాహాటంగా అభిప్రాయాన్ని తెలపగా.. కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఆయనపై ఆరేండ్ల పాటు బహిష్కరణ వేటు వేసింది. గతంలో ఇదే కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు ఏకంగా అధిష్ఠానం నియమించిన రాష్ట్ర వ్యవహారాల కమిటీ ఇన్‌చార్జీ గురించి అనుచితంగా మాట్లాడినప్పుడు క్రమశిక్షణ కమిటీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దాని ద్వంద్వ నీతిని తెలియజేస్తున్నది.**

సంపదకు సేవా పరిమళం

భరత్ చౌహాన్

దేశ కీర్తిని యావత్ ప్రపంచానికి వ్యాప్తిచేసిన పారిశ్రామికవేత్త రతన్ టాటా దివికేగడం బాధాకరం. టాటా సన్స్ సంస్థ మాజీ చైర్మన్ రతన్ టాటా ఇక లేరనే విషయాన్ని దేశం జీర్ణించుకోలేకపోతున్నది. వ్యాపారవేత్తగా ఆయన ఎంతగా రాణించారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సంపదలోనే కాదు, సమాజ సేవలోనూ ఆయన ఖ్యాతి గడించారు. ఆయన జీవితం యువతకు ఆదర్శం. విలువలపై వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన ఏకైక పారిశ్రామికవేత్తగా రతన్ టాటా చరిత్రలో తనకంటూ ఒక పేజీని లిఖించుకున్నారు.

అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించిన రతన్ టాటా.. టాటా కుటుంబానికి సాంకేతికంగా మాత్రమే వారసుడు. రతన్ టాటా తండ్రి నావల్ టాటా సూరత్‌లో దిగువ, మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. నాలుగేండ్ల వయసులోనే నావల్ తండ్రి చనిపోగా, కుటుంబాన్ని పోషించలేక అతని తల్లి అనాథాశ్రమంలో చేర్చింది. నావల్ టాటాను రతన్ జంషెడ్జీ టాటా దత్తత తీసుకున్నారు. అలా నావల్ కాస్త నావల్ టాటాగా మారారు. నావల్ టాటా- సోను దంపతులకు 1937, డిసెంబర్ 28న రతన్ టాటా జన్మించారు. తన పదేండ్ల వయసులో తల్లిదండ్రులు విడాకులు తీసుకున్నారు. దీంతో నాయనమ్మ నవాజ్ భాయి సంరక్షణలో రతన్ టాటా, అతని సోదరుడు జిమ్మి పెరిగారు. మామూలుగా అయితే రతన్ జీవితంలో కష్టాల్లేవనుకుంటాం, అతను గోల్డెన్ స్పూన్‌తో పెరిగాడనుకుంటాం. కానీ, రతన్ తన జీవితంలో ఎన్నో ఆటుపోట్లను చవిచూశారు. తను ఆర్కిటెక్ట్ అవుదామనుకుంటే తండ్రి ఇంజినీరింగ్ చేయమన్నాడు, తను అమెరికాలో విద్యాభ్యాసం చేయాలనుకుంటే తండ్రి ఇంగ్లాండ్‌లో చదువుకోమన్నాడు. చివరికి రతన్ తన తాత (జంషెడ్జీ టాటా)ను ఒప్పించి అమెరికాలోని కార్నెగీ వర్సిటీలో చదువుకున్నారు.

రతన్ టాటా 1991లో టాటా గ్రూప్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎప్పుడూ దేశానికే తొలి ప్రాధాన్యం ఇచ్చారు. తను బాధ్యతలు స్వీకరించే సమయానికి టాటా కంపెనీ రెవెన్యూ రూ.10 వేల కోట్లుగా ఉన్నది. ఆ తర్వాత రతన్ టాటా అంతర్జాతీయస్థాయిలో కంపెనీని విస్తరించారు. కంపెనీ బ్రాండ్ వాల్యూను కొనసాగిస్తూ ఆయన చేపట్టిన సంస్కరణలతో పదవి నుంచి దిగిపోయేసరికి ఏకంగా కంపెనీ రెవెన్యూ రూ.లక్ష కోట్లకు చేరింది. అంబానీ, అదానీల మాదిరి టాటా టాప్ టెన్‌లో ఎందుకు లేరంటే, దానికి కారణం ఆయన సంపదలో 60 శాతం ఎప్పుడూ దాన ధర్మాలకు ఖర్చు చేస్తుంటారు. టాటా ఇండికా వచ్చిన కొత్తలో కంపెనీ నష్టాల్లో ఉండగా, అమెరికాకు చెందిన ఫోర్డ్ మోటార్స్‌కు అమ్ముతామనుకుంటే వాళ్లు ఎగతాళిగా మాట్లాడినట్టు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత అదే ఫోర్డ్ మోటార్స్ నష్టాల్లో ఉండగా వాళ్ల జాగ్వార్, లాండ్ రోవర్‌ని కొని ఫోర్డ్ మోటార్స్‌కు సహాయం చేశారు. గ్లోబల్ ఎన్‌సీఏపీ క్రాష్ టెస్ట్‌లో ఇండియాలో మొట్టమొదట 5/5 రేటింగ్ సాధించిన కార్ (నెక్సాన్) టాటా కంపెనీదే. ఈ కార్ సృష్టికర్త రతన్ టాటానే. ఇండియాలో రిలయెన్స్ తర్వాత రూ.100 బిలియన్లు సాధించిన సంస్థ కూడా టాటానే. ఇలాంటి విజయాలెన్నో రతన్ టాటా జీవితంలో ఉన్నాయి.

రతన్ టాటాకు కుక్కలంటే మక్కువ. 2018లో ఆయనను బ్రిటన్ రాజు 'లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్' అవార్డు ఇచ్చేందుకు బకింగ్ హామ్ ప్యాలెస్‌కు ఆహ్వానించారు. అయితే తన పెంపుడు కుక్క అనారోగ్యానికి గురికావడంతో రతన్ టాటా ఆ అవార్డు కార్యక్రమానికి వెళ్లలేదు. అది తెలుసుకున్న బ్రిటన్ రాజు ఒక ఇంటర్వ్యూలో రతన్ టాటాను అభినందించడం గర్వకారణం. ఉప్పు నుంచి ఉక్కు వరకు టాటా ప్రవేశించని రంగమే లేదు. ఏ రంగ వ్యాపారమైనా నాణ్యత, నమ్మకమే తన లక్ష్యం. అంచెలంచెలుగా ఎదిగిన రతన్ టాటా కృషి అనితరసాధ్యమైనది. నిత్య మార్గదర్శకుడిగా, మానవతవాదిగా పేరు గడించిన ఆయన ప్రపంచంలోనే దిగ్గజ వ్యాపారవేత్తల్లో ఒకరిగా ఎదిగారు. ఆయన నేతృత్వంలో టాటా గ్రూప్ తనదైన ముద్ర వేసుకున్నది. లాభాల కంటే చిత్తశుద్ధికే రతన్ టాటా ప్రాధాన్యం ఇస్తారు. అదే ఆయనకు అపార గౌరవాన్ని తెచ్చిపెట్టింది. టాటా తీసుకునే నిర్ణయాలు స్వల్పకాలిక లాభాల కంటే, సమాజ హితం కోసం ఉండాలని భావిస్తారు. వ్యాపారాలను నిర్వహించడంలోనే కాదు, దాతృత్వంలోనూ ఆయన ఎప్పుడూ ముందుంటారు. ఆయన వ్యక్తిత్వం ఎంతోమందికి ఆదర్శప్రాయం. 2008లో ముంబైలోని తాజ్‌హోటల్‌పై ఉగ్రవాద దాడి జరిగినప్పుడు రతన్ టాటా చూపించిన ఉదారత ఎంతో గొప్పది. హోటల్ సిబ్బందితోపాటు బాధితులకు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చి, మాట నిలుపుకున్నారు. కరోనా సంక్షోభ సమయంలో పేదల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. తన వ్యాపార సామ్రాజ్యాన్ని ప్రపంచానికి విస్తరించే క్రమంలో ఆయనెప్పుడూ భారతీయ విలువలను విస్మరించలేదు. భారతీయుడిగా గర్వపడుతూనే ఆధునిక వ్యాపారంలో అందనంత ఎత్తుకు ఎదిగారు.

తన స్వలాభం కోసమే కాదు, టాటా కంపెనీల్లో పనిచేసే ఉద్యోగుల కుటుంబాల కోసం కూడా రతన్ టాటా పరితపించారు. అందుకే, ఉద్యోగులు మరణించినప్పుడు వారి కుటుంబ బాధ్యతను తనమీద వేసుకునేవారు. ఆసియాలో మొదటి క్యాన్సర్ హాస్పిటల్ నుంచి ఇండియాలో మొదటి ఎయిర్ లైన్స్ వరకు టాటాలే ప్రారంభించారు. సాల్ట్ నుంచి సాఫ్ట్‌వేర్ వరకు టాటా గ్రూపు అన్ని రంగాల్లో విస్తరించింది. సిగరెట్, ఆల్కహాల్ వ్యాపారాలు తప్ప ఆయన చేయని వ్యాపారం లేదు. గుండు సూది నుంచి గూడ్స్‌రైలు ఇంజిన్ల వరకు టాటా కంపెనీలే నంబర్ వన్. ఆయన చేసిన సేవలకుగాను భారత ప్రభుత్వం రతన్ టాటాను 2000లో పద్మభూషణ్, 2008లో పద్మవిభూషణ్ అవార్డులతో సత్కరించింది.

రతన్ టాటా 2014లో 'హానరరీ నైట్ గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద బ్రిటీష్ ఎంపైర్' పురస్కారాన్ని క్వీన్ ఎలిజబెత్ నుంచి అందుకున్నారు. 2023లో ఆస్ట్రేలియా అత్యున్నత పౌర పురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా'ను అందుకున్నారు. 2023లో మహారాష్ట్ర ఉద్యోగరత్నతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలు ప్రముఖ వర్సిటీలు, దేశాల నుంచి గౌరవ డాక్టరేట్లు, అవార్డులను రతన్ టాటా అందుకోవడం దేశానికే గర్వకారణం. ఇంతటి మహోన్నతమైన వ్యక్తిని కోల్పోవడం యావత్ భారతావనికి తీరని లోటుగా చెప్పవచ్చు.



సీజ్ చేసుకోండి!

> **పెద్ద పెద్ద కార్లు, బంగ్లాల్లో ఉండేందుకే మేం రాజకీయాల్లోకి రాలేదు. అవసరమైతే రోడ్డుపై నుంచి కూడా ప్రభుత్వాన్ని నడపగలం. వారికి (బీజేపీ) సొంత ముఖ్యమంత్రి లేడు, కాబట్టి సీఎం ఇంటిని సీజ్ చేయాలని చూస్తున్నారు. ఇలా చేయడంలోనే ఆనందముంటే చేసుకోవచ్చు. మాకు బంగ్లాలు అవసరం లేదు, ప్రజల హృదయాలే మాకు గూడు.**
>
> **- ఆతిశీ, ఢిల్లీ ముఖ్యమంత్రి**

తెలంగాణ అంటే మనకు మొదట యాదికొచ్చేది బతుకమ్మ పండుగే. ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి మొదలుకొని, స్వరాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమం దాక 'బతుకమ్మ' వేదికగా ఆటపాటలతో మహిళలు ఎన్నో పోరాటాలు చేశారు. తెలంగాణ పుడమి ఒడిలో పురుడోసుకున్న పూలను పూజించుకునే బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడబిడ్డలను గౌరవించుకునే సంప్రదాయం తెలంగాణలో తరతరాలుగా కొనసాగుతున్నది. బతుకమ్మ సందర్భంగా ప్రతి ఆడబిడ్డకు చీరలు పంపిణీ చేసి ఆ సంప్రదాయాన్ని కేసీఆర్ ఉన్నత స్థితికి తీసుకెళ్లారు. కానీ, రేవంత్ నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ మాత్రం బతుకమ్మ పండుగకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిలిపివేసి మహిళల పట్ల చిన్నచూపును ప్రదర్శించడం హేయనీయం.

మహిళలంటే చిన్నచూపా?

బూడిద బిక్షమయ్యగౌడ్

స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు కేసీఆర్ సర్కార్ పెద్దపీట వేసింది. అందులో భాగంగానే బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించింది. ప్రభుత్వం తరపున ఏటా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించింది. ఊరూరా ఉత్సవాలను నిర్వహించేందుకు నిధులు మంజూరు చేసింది. గ్రామాల్లో వీధి లైట్లు, నిమజ్జనం చేసే ప్రాంతాల్లో విద్యుత్తు దీపాలను ఏర్పాటుచేసింది. దీంతో ఆడబిడ్డల ఆటపాటలతో ఊరూవాడ సందడిగా మారేది. అంతేకాకుండా కేసీఆర్ సర్కార్ బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కారణంగా మహిళలు బతుకమ్మ సంబురాలు ఏటా ఘనంగా నిర్వహించుకునేవారు. కానీ, ఈ యేడు పరిస్థితి భిన్నంగా ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిలిపివేసి మహిళల పట్ల వ్యతిరేకతను చెప్పకనే చెప్పింది. అంతేకాదు, బతుకమ్మ పండుగ ప్రారంభమైన నాటినుంచే సందడిగా ఉండాల్సిన పల్లెలు వెలవెలబోయాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా జరుగుతున్న బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తుందని ఆశపడ్డ మహిళలకు నిరాశే మిగిలింది. కనీసం గ్రామాల్లో బతుకమ్మ ఏర్పాట్లను కూడా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడమే అందుకు కారణం.

కుల, మతాలకతీతంగా తెలంగాణలోని ప్రతి ఆడబిడ్డకు బతుకమ్మ సందర్భంగా కానుకను అందించాలన్న నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలో నుంచి బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం పుట్టింది. మొదట్లో 30 డిజైన్లతో ప్రారంభమై, ఆ తర్వాత 225 డిజైన్లకు చేరుకున్నది. మొత్తంగా 21 రంగులు, 500 వెరైటీలతో చీరలు ఉత్పత్తి అయ్యాయి. చీరల రూపకల్పనకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీకి చెందిన నిపుణులను నియమించడం మహిళల పట్ల నాటి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలిపింది.

ఏటా బతుకమ్మ పండుగ సందర్భంగా రేషన్‌కార్డులో పేరున్న ప్రతి మహిళకు కేసీఆర్ ప్రభుత్వం చీరను పంపిణీ చేసింది. కానీ, ఇప్పుడు బతుకమ్మ పండుగ ముగిసినా చీరల పంపిణీ ఊసే లేదు. బీఆర్ఎస్ ఒక్క చీరే ఇచ్చింది, తాము అధికారంలోకి వస్తే రెండు చీరలిస్తామని ఊదరగొట్టిన రేవంత్‌రెడ్డి చీరల పంపిణీ కార్యక్రమానికి మంగళం పాడారు. అంతేకాదు, చీరలకు బదులు నగదు ఇస్తామని ప్రభుత్వ వర్గాల నుంచి లీకులు కూడా ఇచ్చారు. అటు చీరలు, ఇటు నగదు ఏవీ అందలేదని రాష్ట్ర మహిళలు ఆగ్రహం వ్యక్తం చేయడం బాధాకరం.

ఆడబిడ్డలకు కానుకగా చీరలు ఇవ్వాలనే ఉద్దేశంతో మొదలైన ఈ కార్యక్రమం మూలంగా తెలంగాణలో ఆత్మహత్యలు, ఆకలిచావులతో కొట్టుమిట్టాడుతున్న సిరిసిల్ల చేనేత కుటుంబాలకు ఎంతో మేలు జరిగింది. సిరిసిల్లలో మూలకుపడ్డ 16 వేల మరమగ్గాలు మళ్లీ ఊపందుకున్